ఈ వారం కథ

# కాంచనమాల

– అరసూర్ శ్యామసుందర్

## "రాక్సీలో నార్మాషేరర్ బ్రాడ్వేలో కాంచనమాల"

మహాప్రస్థానం ఇది వరకు చాలాసార్లు చదివినా, చదవటానికి కొత్త బుక్స్ లేనప్పుడల్లా మళ్ళీ ఆ బుక్ తిరగేస్తుంటాను. సరిగ్గా కాంచనమాల అన్న పేరు దగ్గర నా చూపు ఆగిపోయింది.

"కాంచనమాల!?"

ఒకనాటి అందాల తార.

శ్రీశ్రీ కవిత్వంలోనికి కూడా వచ్చిందంటే ఆమె నిజంగా ఎంత అందంగా వుంటుందో! నేను ఇంతవరకూ ఆమె సినిమాలేవీ చూడలేదు. కనీసం ఫోటో అయినా చూడలేదు. అయినా కాంచనమాల. అనగానే నా ఊహల్లో ఒక అద్భుత సౌందర్యరాశి సాక్షాత్కరిస్తుంది. కారణం మా మావయ్య. నాకు మా మావయ్యకు ఇరవై ఏళ్ళు తేడా వున్నా ఒకే ఈడు స్నేహితుల్లాగా అరమరికలు లేకుండా వుండేవాళ్ళం. ఆయనకు కాంచనామల ఆరాధ్యదైవం. అరిగిపోయిన రికార్డులాగా అదే పనిగా కాంచనమాల అందాన్ని పొగిడేవాడు. బంగారు వర్ణం, లేత తమలపాకు సౌకుమార్యం, వెన్న, వెన్నెల కలబోసిన లావణ్యం, వీటన్నింటినీ మించిన ఆభిజాత్యం, మొత్తం మీద ఏ తారలోనూ నీ తీరు లేదు అనేంత సౌందర్యం కాంచనమాలది అనేవాడు.

మావయ్య నా బుర్రనిండా నూరిపొయ్యటం వల్లనో ఏమో నాకు ఆ పేరు అంటే యమక్రేజ్ ఏర్పడింది. పెక్యులర్‌గా ఎక్కువగా వినబడని ఆ పేరు అంటే నాకు చెప్పలేనంత ఆకర్షణ. ఈ పిచ్చి ఎంత వరకు వెళ్ళిందంటే ఆ పేరు వినగానే నాలో ఏదో సంచలనం ప్రారంభమవుతుంది. ఒళ్ళు జలదరిస్తుంది. ఊహలు నాట్యం చేస్తాయి. ఊహా సుందరి తన అలవోక చూపులతో మురిపించే నవ్వులతో నన్ను మైమరపింప చేస్తుంది. ఆనంద పారవశ్యంలో తేలిపోతుంటాను నేను. ఇలా నా ఊహా ప్రపంచం ఎంత కాలం సాగేదో గాని ఒకరోజు...

** ** **

కాలేజి టైము దాటి పది నిముషాలు కావొస్తోంది. అటెండెన్స్ రిజిస్టర్ ప్రిన్సిపాల్ రూమ్‌లోకి వెళ్ళి పోయుంటుంది. ఈ రోజు ఆయనతో అక్షింతలు తప్పవు. అనుకుంటూ గేటు తీశాను. అప్పుడే రిజిస్టర్ తీసుకుని అటెండర్, ప్రిన్సిపాల్ రూమ్‌వైపు పోతూ కనిపించాడు.

"నరహరీ" గట్టిగా కేకేసి పిలిచాను. వెళ్ళేవాడల్లా ఆగి నా వైపు తిరిగి ముఖమంతా పళ్ళు కనబడేలా నవ్వాడు.

"ఏంది సారూ గిట్ల లేటు వస్తిరు!" అన్నాడు.

"నా సంగతి అలా వుంచు. నీవేమిటి ఇంత లేటుగా రిజిస్టరు తీసుకెళుతున్నావ్?" అన్నాను.

"ఎవరో లెక్చరమ్మ జేరింది సారూ లీవ్ వేకెన్సీల. గా ప్రభావతమ్మ డెలివరీకి పోయింది గదసార్. గామె ప్లేస్ల గీమె వచ్చింది. కొత్తామెకు రిజిస్టర్ల దస్తఖత్ జేయించమని పెద్దసారు చెబితే రిజిస్టర్ బయటకు తెచ్చిన" అన్నాడు.

రిజిస్టర్‌లో సంతకం పెడుతూ "ఏం పేరు?" అని కాజువల్‌గా అడిగాను.



"గదేందో జమునో కాంచనో ఏదో ఫిల్మ్ హీరోయిన్ పేరు" అన్నాడు.

నాలో చిన్న కదలిక.

గబగబా రిజిస్టర్ వెదికాను.

"కాంచనమాల!!"

ఆ పేరు చదవగానే నా మస్తిష్కంలో కోటి ప్రభలు వెలిశాయి. నా మనసు ఆనందంతో గంతులు వేసింది. ఆపేరు గల వాళ్ళని ఎవ్వరినీ ఇంత వరకు చూడని నాకు ఆ వ్యక్తిని ప్రత్యక్షంగా చూడబోతున్నా నన్న సంబరం నన్ను ఉక్కిరి బిక్కిరి చేసింది.

క్లాసులో స్టూడెంట్స్ అల్లరి చేస్తుండడంతో అటు వైపు నడిచాను. అన్యమనస్కంగా క్లాసు తీసుకున్నాను.

నలభయ్యో పడిలోపడి పెళ్ళయ్యి ఇద్దరు పిల్లలున్న నాకు టీనేజి కుర్రాళ్ళకు మల్లే కలిగిన భావోద్రేకం నాకే నవ్వు తెప్పించింది.

ఇంటర్ వెల్‌లో స్టాఫ్ రూములో కెళ్ళి కూర్చున్న నన్ను పక్కనే వున్న మోహనరావు చిన్నగా గీరుతూ "ఆవిడే కొత్తగా జాయినయింది. పేరు కాంచనమాలట" అన్నాడు.


నేను ఆత్రుతగా ఆమె వైపు చూశాను.

ఒక్కసారిగా నిరాశ, నిస్పృహ నన్ను ఆవరించాయి!?

మహోన్నతంగా లేచిన కడలి తరంగం సడెన్‌గా విరిగి పోయింది. చాలా సాధారణ స్త్రీ ఆవిడ. సామాన్యంగా వుంది. చామనఛాయ. తల నున్నగా దువ్వి కాస్త పెద్ద బొట్టు పెట్టుకుంది. చేనేత కాటన్ చీర పెద్ద బోర్డర్‌ది కట్టుకుంది. నీట్‌గా వున్నా 'కాంచనమాల' అనగానే అద్భుతమైన మనిషిని ఊహించుకున్న నాకు సామాన్యంగా కనిపించిన ఈవిడను చూడగానే చికాకు కలిగింది. ఏ సాధారణమైన పేరో పెట్టుకోకుండా చాలా గొప్ప అందగత్తె అన్నట్లు ఇలాంటి పేరు పెట్టుకున్నందుకు చిరాకు వేసింది. అది తల్లితండ్రులు పెట్టిన పేరని నాకు ఆ క్షణం గుర్తుకు రాలేదు. నా ఊహలు తల్లకిందులు చేసిన ఆమెపై ద్వేషం కలిగింది. మంచి పేరును ఖూనీ చేసింది అని కోపం వచ్చింది. ఊహల్లో విహరించే నాకు ప్రత్యక్షంగా కనబడి నన్నూ నా ఊహల్నీ వెక్కిరించే దిష్టిబొమ్మలా కనిపించింది ఆవిడ.

హిస్టరీ లెక్చరర్ వాసంతి కాంచనమాలను స్టాఫ్‌కి పరిచయం చేసింది. అందరూ ఆసక్తిగా ఆమెను వివరాలు అడుగుతున్నారు. ఆమె కూడా కలుపుగోలుగా ఫ్రీగా మాట్లాడుతోంది. ఇంకా పెళ్ళి కాలేదు. లీవ్ వేకెన్సీలో టెంపరరీగా చేరింది. బహుశా ఒక ఆరు నెలలు వుంటుందేమో ఈ కాలేజీలో. అప్పుడో మాట, ఇప్పుడో మాటగా ఈ రెండు వివరాలు నా చెవిలో పడ్డాయి. నేను ఏ మాత్రం ఆసక్తి చూపించక ముభావంగా వుండిపోయాను.

** ** **




ఆ తరువాత ఆమె ఒకటి రెండు సార్లు నన్ను పలకరించబోయినా కట్ చేస్తూ, ముక్తసరిగా తుంచేస్తూ మాట్లాడాను. ఆమెది బాగా కలివిడి స్వభావంలా ఉన్నట్లుంది. అందరితో ఆప్యాయంగా గలగలా మాట్లాడుతూ కనిపించేది.

రామ రామా టాక్ ఆఫ్ ది టౌన్ లాగా టాక్ ఆఫ్ ది కాలేజి అయిపోయింది. ఆమెకు పట్టని విషయాలు అంటూ ఏవీ లేనట్లు అన్ని విషయాలు పట్టించుకునేది. అందరి కష్టసుఖాలు విచారించేది. కొందరికి సలహాలు ఇచ్చేది. కొందరికి సహాయపడేది.

ముఖ్యంగా ఆమె చేసిన మార్పు ఏమిటంటే కాలేజి కాంపస్‌లో ఎక్కడా ఒక్క చిన్న మొక్క కూడా లేకుండా ఎడారిలా వుండేది. స్టూడెంట్స్‌కి చెప్పి వాళ్ళ ఇళ్ళ నుంచి మొక్కల్ని తెప్పించి నాటించింది. లీజర్ పీరియడ్స్‌లో ఆసక్తి వున్న విద్యార్థులతో వాటికి నీళ్ళు పోయించేది. స్టూడెంట్స్‌కి కూడా ఇదేదో కొత్తగా వున్నట్లుంది. చాలా ఇంట్రస్టుగా కాలేజి టైమ్ అయిపోయిన తరువాత కూడా వుండి మొక్కలకు నీళ్ళు పొయ్యటం, పాదులు చెయ్యటం లాంటి పనులు చేస్తుండేవారు.

ఆ రోజు స్టాఫ్‌రూమ్‌లో ఒక కొత్త ప్రపోజల్ చేసింది కాంచనమాల. "పూల మొక్కలు దాదాపు అన్ని రకాలు పెట్టాము. ఇవన్నీ పూలు పూస్తే కాలేజి ఎంత అందంగా కనబడుతుందో, ఇకపోతే కాంపస్‌లో ఒక్క చెట్టు కూడా లేదు. నీడనిచ్చే చెట్లు కాంపౌండ్ వాల్ వైపు నాటితే బాగుంటుంది" అన్నది

"ఎందుకండీ ఈ శ్రమ అంతా? మనకిచ్చే జీతాలకి గంటలు గంటలు నోరు ఎండిపోయేలా అరుస్తున్నాము. అది సరిపోలేదా? ఇంకా ఈ గాడిద చాకిరి కూడా ఎందుకు?" అన్నాడు గంగాధరం.

వాసంతి అందుకుంది.

"నిజమేనండీ కాంచనమాలగారూ! మీరు ఎంతో శ్రద్ధ తీసుకుని మొక్కల్ని నాటుతున్నారు. బాగానే వుంది. కానీ స్టూడెంట్సుకి ఎవరి మీద కోపం వచ్చినా ముందు పడేది మొక్కల మీదే. ఇంత శ్రమ పడి పెంచి చివరికి మన కళ్ళ ముందే ధ్వంసం అయితే మనకెంత మనస్తాపం కలుగుతుంది! మీరో కొత్తగా వచ్చి ఉత్సాహంగా పని చేస్తుంటే డిప్రెస్ చెయ్యడం ఎందుకని ఇన్ని రోజులు ఏమీ చెప్పలేదు" అన్నది.

ఒక్క క్షణం మౌనంగా వుంది కాంచనమాల. ఆ తరువాత అన్నది –

"ఎప్పుడో ఏదో అవుతుందని ఏ పనీ చెయ్యకుండా వుండలేం కదండీ. అయినా స్టూడెంట్స్‌ని తక్కువ అంచనా వేస్తున్నారు. వాళ్ళు నాటిన మొక్కలు వాళ్ళే పాడు చేస్తారంటారా? సరే ఆ విషయం పక్కన పెట్టండి. ఇప్పుడు చెట్టు నాటే ప్రోగ్రాం పెట్టాను ఒక్కో లెక్చరర్ ఒక్కో చెట్టు నాటాలి. ఒక్కో మొక్క ఇద్దరు ముగ్గురు స్టూడెంట్స్‌కి అలాట్ చేస్తాను. వాళ్ళు ఆ చెట్టు బాధ్యత తీసుకుంటారు. ఎవరు నాటిన చెట్టు వారు మాత్రం ప్రతిరోజూ గమనిస్తుంటే చాలు" అన్నది.

ఎప్పుడూ బోర్‌గా ఆర్థిక బాధలు, పే స్కేల్స్ అన్యాయాలు, స్టూడెంట్స్ చేసే ఆగడాలు మొదలైన సంభాషణలతో నిండి వుండే స్టాఫ్ రూమ్‌లో కాంచనమాల మాటలు పిల్ల తెమ్మెరలా కొత్తగా వినిపించాయి.

"స్టూడెంట్స్‌తో మొక్కలు తెప్పించాను. బయట బాగా మబ్బు పట్టి వుంది. వెళదామా" అన్నది కాంచనమాల.

ఇదేదో తమాషాగా వుందే అనుకుంటూ అందరూ లేచారు నేను తప్ప. ఏ విషయమయినా చర్చకు రాగానే స్టాఫంతా రెండు పక్షాలుగా విడిపోయి వాదులాడుకునే వారు. అలాంటిది కాంచనమాల ప్రపోజల్‌కి అందరూ నాగస్వరం విన్న పాముల్లాగా బయటకు నడవటం నాకు విచిత్రంగా అనిపించింది. ఆమెపట్ల కాస్త జలసీగా అనిపించింది. మరుక్షణం సర్దుకున్నాను. నా ఊహాచిత్రాన్ని కాలరాచిన ఆమె ఎలాపోతే నాకేమిటి? ఆమె గురించి ఆలోచించకూడదు అనుకున్నాను.

కిటికీలోంచి చూస్తున్నాను. ప్రిన్సిపాల్‌గారిని కూడా పిలుచుకొచ్చింది. ముందుగానే ప్రిపేరయినట్లుంది. ఆమె చేతిలో ఒక లిస్ట్ వుంది. అందులో ఏ మొక్క ఎవరు నాటాలి అన్న వివరాలు వున్నాయి. ప్రిన్సిపాల్ని ముందుగా ఆహ్వానించింది. ఆయన కాస్త మినిస్టర్ అయిపోయినట్లు ఫీలయిపోయి చుట్టూ వున్న స్టాఫ్‌తోను, స్టూడెంట్స్

తోను చెట్లు నాటడంలో గల గొప్పదనం గురించి, అరణ్యాలు ఎలా అంతరిస్తున్నాయి, పర్యావరణం ఎలా దెబ్బ తింటోంది మొదలైన విషయాలతో భారీ ఉపన్యాసం ఇచ్చారు. కాంచనమాల మొదలెట్టిన ఈ ప్రోగ్రాంను మెచ్చుకున్నారు. తరువాత ఆయన ఒక మావిడి మొక్కను నాటారు. సీరియల్‌గా పేర్లు పిలుస్తోంది కాంచనమాల. లెక్చరర్స్ ఉత్సాహంగా మొక్కలు నాటడం, స్టూడెంట్స్ చప్పట్లు కొట్టడం కోలాహలంగా వుంది వాతావరణం.

నా పేరు కూడా పిలుస్తోందేమో ఎలాగైనా తప్పించుకోవాలనుకుని మెల్లగా బయటకు వచ్చి పక్కనే వున్న లైబ్రరీ గదిలోకి దూరాను.

"చక్రవర్తిగారు.. చక్రవర్తిగారేరీ?" అన్నది కాంచనమాల.

అందరూ అటూ ఇటూ చూశారు.

"ఇక్కడే వుండాలే! ఎక్కడికెళ్ళారబ్బా?" అన్నది వాసంతి. ఒక స్టూడెంట్ స్టాఫ్ రూమ్‌లోకి తొంగి చూస్తూ "ఇక్కడ కూడా లేరు మేడమ్" అన్నాడు.

"పోనీలెండి. ఆయన బదులు నేనే నాటుతాను. వర్షం కూడా వచ్చేలా వుంది. శుభసూచకం" అంటూ గుల్‌మోహర్ మొక్కను తీసుకుని నాటింది కాంచనమాల.

ఇదంతా రహస్యంగా గమనిస్తున్న నేను అర్థం కాని భావంతో ఉడికిపోయాను.

** ** **


మెయిన్ రోడ్ నుంచి కాలేజి కొంత దూరం వుంటుంది. రోడ్డునూ కాలేజినీ కలుపుతూ ఎప్పుడో వేసిన మట్టి రోడ్డు గుంటలు పడి మొన తేలిన రాళ్ళతో నానా ఛండాలంగా వుంటుంది. వర్షాకాలం వచ్చిందంటే బురద బురదగా వుండి నడుస్తుంటే కాళ్ళు కూరుకుపోతుంటాయి. స్కూటర్ కయినా సైకిల్ కయినా ఆ బాధ తప్పదు.

వరుసగా వచ్చిన బక్రీద్, సెకండ్ సాటర్‌డే, సండే సెలవుల తరువాత కాలేజికి వచ్చిన నేను ఒక్క క్షణం అలా నిలబడి పోయాను. బాగా రాళ్ళు, మట్టి పోసి చదును చేసిన నీట్‌టైన రహదారి కనబడుతోంది. మంత్రం వేసినట్లు మారిపోయిన రోడ్డును చూస్తూ నిలబడ్డ నా భుజం తట్టాడు మోహన్‌రావు.

ఏమిటండీ అలా నిలబడ్డారు?" అన్నాడు.

"ఎంతకాలం నుండి నోటీసులు పంపిస్తున్నాం సొసైటికి ఈ రోడ్డు బాగుచేయించమని. ఇన్నాళ్ళకు కనికరం కలిగిందన్నమాట. ఆ వేసేది కాస్త కంకర రోడ్డు వేస్తే సరిపోయేది కదా. పక్కాగా వుండేది" అన్నాడు.

"ఇది కాలేజి సొసైటీ చేసిన పని కాదు మాస్టారూ. మేడమ్ కాంచనమాలగారు, స్టూడెంట్స్ శ్రమదానంతో ఈ రోడ్డు వేశారు. నిజంగా ఆవిడను చెప్పుకోవాలి. ఎప్పుడూ ఏదో ఒక పని అందరికీ పనికొచ్చేది చేస్తుంటుంది. ఆవిడ ఓపికకు జోహార్లు" అన్నాడు మోహన్‌రావు మెచ్చుకోలుగా.




నాకు ఆ మాటలు మింగుడు పడలేదు. కళ్ళముందు కాంచనమాల నన్ను వెక్కిరిస్తున్నట్టు ఫీలయ్యాను.

ఆ రాత్రి ఎంతకీ నిద్రపట్టక అటూ ఇటూ దొర్లుతూ గడిపాను. నాకేసి చెయ్యి చూపిస్తూ, నవ్వుతూ కాంచనమాల వివిధ భంగిమల్లో నన్ను వెక్కిరిస్తూ కనిపించింది.

నేను ఒక చిత్రం గమనించాను. అంతవరకు కాంచనమాల అనగానే ఊహాసుందరి ప్రత్యక్షమయ్యే నాకు తొలిసారిగా లెక్చరర్ కాంచనమాల కనిపించింది.

** ** ** **

కాలేజీలో ఫంక్షన్ జరుగుతోంది.

ఆరుబయట వేసిన కుర్చీలు స్టూడెంట్స్, వారి తల్లిదండ్రులతో నిండిపోయింది. నిలబడ్డవారు కుర్చీల చుట్టూ దడి కట్టారు. ఫంక్షన్ జరుగుతోంది అన్న మాటే గానీ ఎవ్వరిలోనూ ఉత్సాహం లేదు. అందరూ గంభీరంగా వున్నారు.

డయాస్ మీద ప్రిన్సిపాల్ ఉపన్యాసం సాగుతోంది.

"ఇంతవరకూ టెంపరరీ స్టాఫ్‌కు సెండాఫ్ ఇచ్చే సంప్రదాయం మన కాలేజీలో లేదు. ఈనాడు కాంచనమాల గారికి మనమందరం ఇంత ఘనంగా ఫేర్‌వెల్ ఇస్తున్నామంటే అందుకు కాంచనమాల వ్యక్తిత్వమే కారణం. మనతో కొంతకాలమే పనిచేసినా వున్న కొద్దిరోజులు కాలేజి వాతావరణాన్ని చైతన్యవంతం చేసింది. ఈ రోజు స్టూడెంట్స్ ఇంత బుద్ధిగా కూర్చున్నారంటే అది కాంచనమాలగారి మహత్యమే. ఎవరో వచ్చి ఏదో చేస్తారని రోజులు వెళ్ళమార్చకుండా, మన సమస్యలు మనమే పరిష్కరించుకోవాలి అని కాంచనమాల మాటల ద్వారా కాక చేతల ద్వారా చూపించింది. కాంచనమాల లాంటి వ్యక్తి ఊరికి ఒక్కరుంటే ఆ ఊరు బాగుపడుతుంది. తద్వారా దేశం బాగుపడుతుంది. ఈ సందర్భంగా రెండు శుభవార్తలు చెబుతాను మీకు. శిరీష అనే కలం పేరుతో రచనలు చేసేది కాంచనమాల గారే. ఆమె రచన 'క్రాంతిపథం'కి సాహిత్య అకాడమీ ప్రైజ్ వచ్చింది".

వింటున్న నా బుర్ర తిరిగిపోయింది. ఎందుకంటే శిరీష నా అభిమాన రచయిత్రి. ఇంతకాలం మాతో వున్న కాంచనమాలే శిరీషా!? ఆశ్చర్యంగా నోరు తెరిచాను.

"ఇంకో గుడ్ న్యూస్ ఏమిటంటే కాంచనమాల గారికి హైదరాబాద్‌లో పర్మనెంట్ జాబ్ వచ్చింది. ఆమె భవిష్యత్ ఉజ్వలంగా వుండాలని, ఆమె మరెంతోమంది జీవితాలని ప్రభావితం చేయాలని, మనమంతా ఆవిడ చూపిన మార్గంలో పయనించాలని ఆశిస్తూ ముగిస్తున్నాను. ఇంకా ఎవరైనా మాట్లాడాలనుకుంటే మాట్లాడవచ్చు" అన్నారు.

నాకు వెంటనే స్టేజిపైకి వెళ్ళి మాట్లాడాలనిపించింది. మరుక్షణం ఎందుకో గిల్టీగా ఫీలయ్యాను.

తరువాత ఎవరెవరో మాట్లాడుతున్నారు. నేను భావరహితంగా కూర్చుండిపోయాను.

ఫంక్షన్ ముగిసింది. ఎందరో ఆమెను బహుమతులతో ముంచెత్తుతున్నారు. నేను ఏమీ పట్టుకురాలేదు. నా చేతిలో శ్రీశ్రీ మహాప్రస్థానం వుంది. గబుక్కున మొదటి పేజీ తెరిచి "నా అభిమాన రచయిత్రి శిరీషగారికి అభినందనలతో చక్రవర్తి" అని రాశాను.

ఆమె పేరుపేరునా అందరినీ పలకరిస్తూ నేను కూర్చున్న చోటికి వచ్చింది. అప్రయత్నంగా లేచి నిలబడ్డాను. మహాప్రస్థానం బుక్కు ఆమెకు అందించాను. ఆమె పేజీ తెరిచి నేను రాసింది చదివింది.

"చాలా సంతోషం చక్రవర్తిగారూ! ఇంతకాలం మీరు నాతో మాట్లాడకుండా ముభావంగా వుంటే నేనేం తప్పు చేశాను అని మథనపడుతూ వుండేదాన్ని. ఈ రోజు నాకు ఎంతో ఆనందంగా వుంది" అన్నది నవ్వుతూ.

నిర్మలంగా మనసారా నవ్వుతున్న ఆమె ముఖం తేజోవంతంగా వెలిగిపోతోంది. ప్రపంచ సుందరి సుస్మితాసేన్ నవ్వు కూడా ఆమె ముందు దిగదుడుపే అనిపించింది.

కన్నీటి మసకతో ఆమెకు వీడ్కోలు చెప్పాను.

ఇప్పుడు కాంచనమాల అనగానే నాకు ఊహామూర్తి కాక శిరీష కనిపిస్తోంది. ◆